తెలుగు దినపత్రిక

సూర్యోదయ వార్త

ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక : 22 | ఆదివారం 11.10. 2026 | పేజీలు :4 | వెల: 2



ఢిల్లీలో నిరసనల సెగ

మమతా బెనర్జీ, కేజ్రీవాల్, పినరయి విజయన్ అదుపులోకి... అగ్రనేతల అరెస్టులతో ఉద్రిక్తత!

- ప్రతిపక్ష నేతలను బస్సుల్లో తరలించిన పోలీసులు
- 24 గంటల్లో విడుదల చేయకుంటే నిరాహారదీక్ష చేస్తానన్న వాంగ్‌చుక్
- ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీనామా డిమాండ్‌తో ఆందోళనలు

4

దేశ రాజధాని ఢిల్లీ నిరసనలతో అట్టుడికింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.

విమానం దిగకముందే అదుపులోకి..

దీపేష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

వెనక్కి తగ్గేది లేదు!

లోక్ సభ విపక్ష నేత రాహుల్ గాంధీ

విద్యుత్ ఆధారిత పనులను తాత్కాలికంగా వాయిదా

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వచ్చే ఏడాది జూన్ వరకు సాగు, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యలపై సరైన యాక్షన్ ప్లాన్
- ఎల్‌నినో పరిస్థితులపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష
- పలు అంశాలపై వారికి దిశానిర్దేశం
- విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉంది
- విద్యుత్ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధం
- అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉంది.
- తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్
- సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు



హైదరాబాద్ సూర్యోదయ వార్త

ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయ స్థాయిలో సంక్షోభ పరిస్థితులు తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో తక్షణ చర్యలకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి . రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులపై జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉండటంతో చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రాబోయే 8 నెలలు ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో కీలకమని ముఖ్యమంత్రి గారు అభిప్రాయపడ్డారు. ఈ 8 నెలల పాటు ప్రతి కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని, అయితే మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేదని తెలిపారు. అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత మేరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఎల్‌నినో ప్రభావంపై గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సినిమా, మీడియా, కళాజాతాలతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.



అట్టహాసంగా బతుకమ్మ సంబరాలు

- రవీంద్రభారతి, పబ్లిక్ గార్డెన్‌లో ఎంగిలిపూల వేడుకలు
- పాల్గొన్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్
- మహిళలతో కలిసి ఆడిపాడిన అమాత్యులు

తీరొక్క పూలన్నీ ఒకచోట చేరినట్లు.. తెలంగాణ సంస్కృతికి నిలువెత్తు అద్దం పడుతూ బతుకమ్మ పండుగ ఘనంగా మొదలైంది. రంగురంగుల పూలను అందంగా పేర్చి, పట్టుబట్టలు ధరించిన మహిళల ఆటపాటలతో హైదరాబాద్ నగరంతో పాటు విదేశీ గడ్డపైనా అద్భుతమైన సందడి నెలకొంది.

దేశ అభివృద్ధికి ఎంఎస్ఎంఈలే బలమైన స్తంభాలు : కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

హైదరాబాద్ సూర్యోదయ వార్త



ఎంఎస్ఎంఈలు కేవలం పరిశ్రమలు మాత్రమే కావని.. దేశ పారిశ్రామిక రంగానికి బలమైన స్తంభాలని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ తాజ్ డెక్కన్‌లో నిర్వహించిన 'లఘు ఉద్యోగ్ భారతీ-సౌత్ ఇండియా కాంక్లేవ్'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధనలో, దేశంలో ఉద్యోగ కల్పనలో ఎంఎస్ ఎంఈలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. దేశ జీడీపీలో 32 శాతం, తయారీ రంగంలో 36 శాతం, ఎగుమతుల్లో 49 శాతం వాటా ఎంఎస్ఎంఈలదేనని పేర్కొన్నారు. ఉద్యమ్ ప్లాట్‌ఫామ్‌పై నమోదు చేసుకున్న 9.80 కోట్ల ఎంఎస్ఎంఈల ద్వారా 40 కోట్లకు పైగా ప్రజలకు ఉపాధి లభిస్తోందని, వీటిలో 37 శాతం మహిళా యాజమాన్యంలో నడుస్తున్నాయని వివరించారు. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలకు త్వరితగతిన అనుమతులు, ఆర్థిక సాయం, పన్ను రాయితీలు అందిస్తున్నట్లు చెప్పారు. క్రెడిట్ గ్యారంటీ ఫండ్, పీఎం విశ్వకర్మ, ముద్ర, జెమ్ వంటి పథకాల ద్వారా రుణ సౌకర్యం, మార్కెట్ తోడ్పాటు అందిస్తున్నామన్నారు. ఆవిష్కరణలు, నూతన సాంకేతికత ఉన్న సంస్థలకు దీర్ఘకాలిక ఈక్విటీ మూలధనం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, బ్యాంకులు కూడా చిన్న వ్యాపారులకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలని కోరారు. 2014 తర్వాత దేశం అన్ని రంగాల్లో వేగంగా విస్తరించిందని, విదేశీ పెట్టుబడులకు భారత్ స్వర్గధామంగా మారిందని అన్నారు. తొలిసారిగా 1 బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామని, విద్యుత్ కోతలు లేని నయా భారత్‌ను నిర్మించామని తెలి పారు. భారత్ ఆర్థికంగా బలోపేతమవుతుంటే ప్రతి పక్షాలు, కొన్ని అంతర్జాతీయ శక్తులు ఓర్వలేక దేశ పరువు తీసేలా వ్యవహరిస్తున్నాయని, ఇది యువత ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.



కాంగ్రెస్ ఆరోపణలు అబద్ధం

3

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

నువ్వు బతికే ఉన్నావా..

పురుగుల మందు తాగి చావలేదా?'

- బాధితుడైన రైతుపై గజ్వేల్ తహసీల్దార్ అనుచిత వ్యాఖ్యలు!
- రైతు గోడు వినాల్సిన అధికారి.. చావు మాటలతో వెటకారం!
- భూ సమస్య పరిష్కారం కోసం తిరుగుతున్న అన్నదాతకు అవమానం



గజ్వేల్ తహసీల్దార్ తీరుపై తీవ్ర విమర్శలు

క్రీడాభివృద్ధికి పెద్దపీట

గోల్ఫ్ లీగ్ ముగింపు వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి

"రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియాన్ని నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారు.." అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.



ఎంఎస్ఎంఈలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తాం
మంత్రి శ్రీధర్‌బాబు

'రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలను బలోపేతం చేసేందుకు త్వరలో ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయబోతున్నాం. " అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.



దశ దిన కర్మలకు శ్రీ లక్ష్మి నరసింహ దత్త సేన సేవా ట్రస్ట్ చేయూత..



మంగపేట. అక్టోబర్ 10(సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మంపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో తోటమల్ల నర్సింహా రావు (45) మృతి చెందారు. శ్రీ లక్ష్మి నరసింహ దత్త సేన సేవా ట్రస్ట్ చైర్మన్ ఈశ్వర్ చందు ట్రస్ట్ సభ్యుల ద్వారా విషయం తెలుసుకొని నీరు పేద కుటుంబం కావడంతో నేడు ఆదివారం జరిగే దశ దిన కర్మలకు 50 కేజీలు బియ్యం అందజేశారు.ఈ కార్యక్రమంలో జయరాజు,బోడ ప్రవీణ్,ఏసు రత్నం,అంజి బాబు, బాబు రావు,అబ్రహం, శ్రీనివాస్,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు






సుజాత నగర్ సూర్యోదయ వార్త అక్టోబర్ 10 :

శ్రీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ లో బతుకమ్మ పండుగ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. గుంతేటి చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందని, విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతిని కూడా కాపాడుకోవాలని సూచించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. కళాశాల ఆవరణమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో వైస్ ప్రిన్సిపాల్ డా. హరీష్, ఫ్యాకల్టీ సభ్యులు ఉషశ్రీ, రాజేశ్వరి, మంజు, వీరు నాయక్, సునీత, కీర్తి, ఉషారాణి, పద్మజ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



మంగపేట. ములుగు జిల్లా అక్టోబర్ 10 (సూర్యోదయ వార్త)

– ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో శనివారం ఉదయం నుంచే పోలీసులు ఇసుక లారీ డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా లారీ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారని విషయంపై పోలీసులు పరీక్షలు చేపట్టారు. వాహనాలు నడిపే సమయంలో లారీ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసుల సూచించారు. మద్యం సేవించి వాహన నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు..

మల్లూరు కేసీఆర్ కాలనీలో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు..

మహిళలు వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మలతో సందడి..

మంగపేట. ములుగు జిల్లా అక్టోబర్ 10(సూర్యోదయ వార్త.)



– ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు కెసిఆర్ కాలనీలో శనివారం రాత్రి ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు ఉద యం నుంచే వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం వాటినీ బతుకమ్మ గ ద్దెల వద్దకు తీసుకెళ్లి సాంప్రదాయ దుస్తుల్లో మహిళలు.పిల్లలు ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. దీంతో మల్లూరు కేసీఆర్ కాలనీలో పండగ వాతావరణం నెలకొంది..

18 ఎకరాల్లో స్టేడియం ఏర్పాటుకు కృషి

- బృందావనంలో సుజాతనగర్ అభివృద్ధికి సీపీఐ కృషి రూ.8.75 కోట్లతో
- తెలంగాణ పబ్లిక్ స్కూల్ రూ.5 కోట్లతో
- సింగభూపాలెం చెరువు కట్ట అభివృద్ధి

రూ.500 కోట్లతో కొత్తగూడెం రింగ్ రోడ్డు

సుజాతనగర్ సూర్యోదయ వార్త అక్టోబర్ 10 :

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీపీఐ నిరంతరం కృషి చేస్తోందని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు గారు తెలిపారు. ఈరోజు నిర్వహించిన పత్రికా సమావేశంలో సుజాతనగర్ కార్పొరేషన్‌తో పాటు కొత్తగూడెం నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. విద్య, సాగునీరు, రహదారులు, క్రీడలు, మహిళలకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు.

రూ.8.75 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్

సుజాతనగర్ కార్పొరేషన్ పరిధిలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు రూ.8.75 కోట్ల నిధులు మంజూరు చేయించామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. త్వరలోనే పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

సింగభూపాలెం చెరువు కట్టకు రూ.5 కోట్లు

సింగభూపాలెం చెరువు కట్ట అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు. సీతారామ సాగర్ కాలువ ద్వారా సింగభూపాలెం చెరువుకు మరో ఐదు రోజుల్లో నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. రైతులకు సాగునీటి సౌకర్యాలు మెరుగుపడేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.



రూ.500 కోట్లతో కొత్తగూడెం రింగ్ రోడ్డు

కొత్తగూడెం పట్టణ అభివృద్ధికి రూ.500 కోట్లతో రింగ్ రోడ్డు మంజూరు చేయించామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి అధికారులతో చర్చలు జరుపుతున్నామని, భూసేకరణ, సాంకేతిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు.

18 ఎకరాల్లో స్టేడియం ఏర్పాటుకు కృషి

బృందావనం సమీపంలో 18 ఎకరాల స్థలాన్ని సేకరించామని, అక్కడ స్టేడియం ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. యువతకు క్రీడా సదుపాయాలు కల్పించడమే లక్ష్యమన్నారు. మహిళలకు ఉపాధి.. సుజాతనగర్‌లో కమ్యూనిటీ హాల్ మెప్మా ద్వారా మహిళలకు గృహ ఆధారిత ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. సుజాతనగర్‌లో ప్రజల అవసరాల కోసం పెద్ద కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కూడా కృషి చేస్తామని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి, మంత్రులు, ఐఏఎస్ అధికారులు, సీనియర్ అధికారులు సహకరిస్తున్నారని కూనంనేని సాంబశివరావు గపేర్కొన్నారు. సుజాతనగర్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి, ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. పత్రికా సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడు గణేష్, టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు , గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు , మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్ , సీపీఐ మండల కార్యదర్శి కోమరి హనుమంతరావు , సీపీఐ జిల్లా కార్యవర్గం సభ్యులు దసరు , జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు , తాలూరి పాపారావు ,సహాయ కార్యదర్శి తాలూరి ధర్మారావు , గోపి వీర్ల మల్లేష్, బొడ్డు కేశవరావు,సీతంపేట సర్పంచ్ గరిక ఉపేందర్, బండి రమేష్, భూక్యా శ్రీను, ఆకుల వెంకన్నా,కోమరి కృష్ణ, దండు నాగేశ్వరావు, సురేష్ ,రవీందర్,వెంకట్,రాజేందర్, గ్రామ పెద్దలు పోటు రాఘవరావు,ఉడుముల తిరుపతి రెడ్డి, మన్నెపల్లి రవి, తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం.. అభివృద్ధి కార్యక్రమాల సాధనే లక్ష్యంగా సీపీఐ ముందుకు సాగుతోంది.

ఆదివాసి చట్టాలు జీవోలు అమలుకై అవగాహన సదస్సు

- ముఖ్యఅతిథిగా హాజరైన.మాజీ ఎంపీ డాక్టర్ మీడియం బాబూరావు..
- ఘనంగా సన్మానించిన మంగపేట మండల ఆదివాసి ప్రజాసంఘాలు..

మంగపేట. ములుగు జిల్లా. అక్టోబర్ 10(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న 1/70 భూ కేసులను త్వరితగతిన పరిష్కరించి, అక్రమాలకు గురైన ఆదివాసీ భూములను తిరిగి అర్హులైన హక్కుదారులకు అప్పగించాలని మాజీ ఎంపీ డాక్టర్ మీడియం బాబూరావు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ మరియు సాంస్కృతిక సంఘం (ఏఇ డబ్ల్యూ సి ఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కొండ చెంచయ్య అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ మీడియం బాబూరావు మాట్లాడుతూ, ఆదివాసీల భూమి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అమలులో ఉన్న 1/70 భూ బదలాయింపు నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలను సత్వరమే పరిష్కరించి ఆదివాసీ కుటుంబాలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఆదివాసీల భూములు అక్రమ ఆక్రమణలకు, చట్టవిరుద్ధమైన బదలాయింపులకు గురికాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీ భూముల రికార్డులను సమగ్రంగా పరిశీలించి ప్రత్యేక సర్వే నిర్వహించాలని, ఆక్రమణలకు గురైన



భూములను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. భూ రికార్డుల్లో ఉన్న తప్పులను సరిచేసి, భూమి హక్కులకు సంబంధించిన పత్రాలను బాధితులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అక్రమ బదలాయింపులకు పాల్పడిన వారితో పాటు వాటికి సహకరించిన అధికారులపై కూడా విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఆదివాసీల హక్కులు భూమికే పరిమితం కావని,వారి భాషలు, సంస్కృతి,ఆచారాలు, సంప్రదాయాలు, జీవన విధానం, సంప్రదాయ పరిపాలనా వ్యవస్థలను కూడా కాపాడాల్సిన అవసరం ఉందని డాక్టర్ మీడియం బాబూరావు అన్నారు. ఆదివాసీ భాషలకు ప్రోత్సాహం కల్పించడంతో పాటు, వారి సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించేలా ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.అలాగే, పీసా (పి ఈ ఎస్ ఎ) చట్ట స్ఫూర్తికి అనుగుణంగా గ్రామసభలను బలోపేతం చేసి, ఆదివాసీ గ్రామాల అభివృద్ధి, వనరుల పరిరక్షణ, స్థానిక నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆదివాసీల రాజ్యాంగబద్ధమైన హక్కులు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఆదివాసీల జీవనాధారమైన జల్--జంగల్--జమీన్ (నీరు--అడవి--భూమి) హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, ఆదివాసీలకు న్యాయం జరిగే వరకు వారి సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాలు గొప్ప సమ్మారావు, జబ్బా రవి, మధ్యల నాగేశ్వరరావు, ఆదివాసి ప్రజా సంఘం నాయకులు, ఎట్టి సారయ్య దొర, తాటి నాగరాజు,తోలేం సుధాకర్, కురుసం నరసింహారావు, కొరె మొగిలి,తోలేం రామకృష్ణ, కొమరం రవికుమార్, పూనెం నరసయ్య, తాటి విజయ్, జిగట శ్రీను, ఈసం కృష్ణ, జోగా బాబు, చందా రమేష్, సోయం చెన్నారావు, తోలేం వెంకన్న, గుమ్మడి సారయ్య, యాలం శ్రీను, పొలం రమేష్, సొలం బాబు, సున్నం మధు, తదితరులు పాల్గొన్నారు..



దసరా కానకగా కొండాయి బ్రిడ్జి..!

- ఐలాపూర్. కొండాయి వాసులకు తీరనున్న రహదారి కష్టాలు..



ఏటూరు నాగారం. ములుగు జిల్లా. అక్టోబర్ 10 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని కొండాయి గ్రామస్తుల రవాణా కష్టాలు త్వరలో తీరనున్నాయి. జంపన్న వాగుపై నిర్మిస్తున్న కొండాయి వంతెన పనులు దాదాపు పూర్తయ్యాయి. వంతెనకు సంబంధించిన మొత్తం 8 స్లాబుల నిర్మాణం పూర్తి కావడంతో దసరా పండుగ నాటికి వంతెనను అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తుంది. ఈ వంతెన అందుబాటులోకి వస్తే ఐలాపూర్. గోవిందరాజుల కాలనీ. మల్యాల గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం కానున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో జంపన్న వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో వాగు దాటి ఎందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆసుపత్రికి తరలించడంలోనూ ఇబ్బందులు ఉండేవి. కొండా ఈ వంతెన నిర్మాణం పూర్తయి రాకపోకలు అందుబాటులోకి రావడంతో ఐలాపూర్. కొండాయి. మల్యాల. గ్రామాల ప్రజలు అరసం వ్యక్తం చేస్తున్నారు. దసరా పండుగకు వంతెన అందుబాటులోకి వస్తే తమకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు...

కమలాపురంలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు...!

రంగురంగుల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్దిన మహిళలు...

మంగపేట, ములుగు జిల్లా అక్టోబర్ 10(సూర్యోదయ వార్త.):



తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలు ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. బతుకమ్మ పండుగ మొదటి రోజైన 'ఎంగిలిపూల బతుకమ్మ' వేడుకను పురస్కరించుకుని గ్రామపంచాయతి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.గ్రామపంచాయతి సహకారంతో మహిళలు ఎంతో ఉత్సాహంగా, సంతోషంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్దారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వచ్చి, బతుకమ్మలను మధ్యలో ఉంచి చుట్టూ తిరుగుతూ భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పాటలు పాడుతూ కోలాహలంగా ఆడారు.ఈ వేడుకల్లో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ సంప్రదాయాన్ని ఘనంగా చాటిచెప్పారు. గ్రామపంచాయతి వారు చేసిన ఏర్పాట్లు బాగున్నాయని మహిళలు హర్షం వ్యక్తం చేశారు...



తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...

గ్రామీణ తపాలా ఉద్యోగులది వసుధైక కుటుంబం..

మృతుని కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేత..



ములుగు, అక్టోబర్ 10(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)1

గ్రామీణ తపాలా ఉద్యోగులందరూ ఒకే కుటుంబమని, కష్టకాలంలో ఉన్న తోటి ఉద్యోగి కుటుంబానికి అండగా నిలవడం అందరి బాధ్యతని అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు, హనుమకొండ జీడీఎస్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.హనుమకొండ పోస్టల్ డివిజన్ పరిధిలోని పస్రా సబ్ పోస్టాఫీస్‌లో గ్రామీణ తపాలా ఉద్యోగిగా సేవలందిస్తూ, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సాధిక్ పాషా కుటుంబానికి హనుమకొండ జీడీఎస్ కోఆపరేటివ్ సొసైటీ తరఫున రూ. 50,000 ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా శుక్రవారం పస్రా సబ్ పోస్టాఫీస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మృతుడు సాధిక్ పాషా భార్య కైరున్నిసా బేగంకు రూ. 50 వేల చెక్కును బొద్దున వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... గ్రామీణ తపాలా ఉద్యోగుల కుటుంబాలకు అవసరమైన సమయంలో తోడ్పాటు అందించాలనే ప్రధాన లక్ష్యంతోనే సొసైటీ పనిచేస్తోందన్నారు. ఆర్థిక భరోసాతో పాటు కష్ట సమయంలో అండగా ఉన్నామనే ధైర్యాన్ని నింపడమే ఈ సాయం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. డివిజన్‌లోని ఉద్యోగులందరూ తప్పనిసరిగా కోఆపరేటివ్ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ పెరుమాండ్ల తిరుపతి, పస్రా సబ్ పోస్టుమాస్టర్ బి. రమేష్, పోస్ట్ మ్యాన్ సయ్యద్ వహీద్‌తో పాటు బీపీఎంలు సందీప్ రెడ్డి, అజీజ్ పాషా, వెంకన్న, రాజ్ కుమార్, అశోక్, శ్రీలత, విజయశ్రీ, సాంబయ్య, రాహుల్, మహేష్, తరుణ్, స్వరుణ్, ప్రణతి తదితరులు పాల్గొన్నారు.

రాంపురంలో ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవాలు..

రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో సందడి చేసిన మహిళలు పిల్లలు.





వాజేడు, అక్టోబర్ 10 (సూర్యోదయ వార్త):

ములుగు జిల్లా వాజేడు మండలం రాంపురం గ్రామంలో బతుకమ్మ ఎంగిలిపూల పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ పండుగలో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.. మహిళలు ఉదయం నుంచే రంగురంగుల పూలను సేకరించి బతుకమ్మను పేర్చి సాంప్ర దాయ పద్ధతిలో గద్దెల వద్దకుతీసుకొచ్చిన అనంతరం గౌరమ్మకు పూజలు చేసి బతుకమ్మ సంబరాలనుప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రోడ్డు సత్యమ్మ, తోట ధనలక్ష్మి, టేకుల కృష్ణవేణి, బొల్లె పార్వతి, దార్ర స్నేహ, టేకుల జాహ్నవి. బొల్లె సరోజిని. తోట సడలు. తోట ఆదిలక్ష్మి. తోట లలిత. తదితరులు పాల్గొన్నారు..

ఎస్ఐఆర్ ప్రక్రియ రద్దు చేయాలి...!

మంగపేట మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన..



మంగపేట. ములుగు జిల్లా. అక్టోబర్ 10(సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలో శనివారం ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని. తొలగించిన ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మంగపేట మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ– కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ఏకపక్ష నిర్ణయాన్ని వెనకకు తీసుకొని ఓ టర్ జాబితా పై తప్పులు చేసిన అధికారులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఎం నాయకులు పాల్గొన్నారు....

వన్‌టౌన్ సీఐ జితేందర్‌ను కలిసిన విలేకరుల బృందం



కొత్తగూడెం (సూర్యోదయ వార్త)

కొత్తగూడెం వన్‌టౌన్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జితేందర్‌ను శనివారం విలేకరుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సీనియర్ రిపోర్టర్ సీమకుర్తి రామకృష్ణ, మధుబాబు, కరాటే మొగిలి, విష్ణువర్ధన్, సాంబశివరావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై పెరుగుతున్న ఆశలు..!

- రెండో జాబితా కోసం అర్హుల ఎదురుచూపులు..
- నిరుపేదల సొంతింటి కల నిజమయ్యే నా...

ములుగు. అక్టోబర్ 10- (. సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ప్రభుత్వం ప్రకటించనున్న రెండో జాబితా ఇందిరమ్మ ఇళ్ల కోసం వందలాదిమంది అర్హులైన లబ్ధిదారులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు . ఈ జాబితాలో తమ పేరు వస్తుందా లేదా అని ఉత్కంఠం భరిస్తు న్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలని లక్ష్యంతో చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ములుగు నియోజకవర్గ వ్యాప్తంగా లబ్ధిదారుల్లో ఆశలు పెరుగుతున్నాయి. ఇప్పటికే మొదటి విడతలో లబ్ధిదారులు ఎంపిక ఇళ్ల మంజూరు ప్రక్రియ పూర్తయి నిర్మాణాల కొనసాగుతున్నాయి. రెండో విడత లో తమకు అవకాశం దక్కుతుందా లేదా అనే సంశయం స్పష్టత నెలకొంది. నియోజకవర్గంలో ఇప్పటికే వేలాదిమంది అర్హులైన లబ్ధిదారులు ఈ పథకం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రతి పంచాయతీ



నుండి 200 నుంచి 400 వరకు అర్హులైన పేదలు ఉన్నట్లు సమాచారం. రెండో విడత ఇందిరమ్మ ఇల్లు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించినట్లు ప్రకటించిన నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపికపై సర్వత్ర ఎదురుచూపులు కనిపిస్తున్నాయి. రెండో విడుదల రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని లక్ష్యంతో ఉన్నట్లు రాష్ట్ర రెవిన్యూ. గృహ నిర్మాణ శాఖ మంత్రి . పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇప్పటికే ప్రకటిం చారు. ముఖ్యంగా ఇల్లు లేని నిరుపేదలు . గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలను ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించినట్లు ఆయన స్పష్టం చేశారు. వార్తలు వెలువడ్డాయి. పక్కా ఏజెన్సీ ప్రాంతాలైన అక్కడ అనేకమంది ఇల్లు లేని నిరు పేద గిరిజనులే అధికంగా ఉన్నారు. వర్షాకాలంలో గుడిసెలు . పాత ఇళ్లలో జీవనం సాగిస్తూ పేద కుటుంబాలకు పక్కా ఇల్లు అనేది ఆశల పల్లవి లాంటిది. దీంతో రెండో జాబితాలోనైనా తమ పేరు ఉండేలా చూడండి బాబు.. అంటూ స్థానికులు. ప్రజా ప్రతినిధులు. అధికార పార్టీ నాయకుల చుట్టూ లబ్ధిదారులు ప్రాధేయపడుతూ గుంపెడు ఆశతో తిరుగుతున్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని ప్రజా ప్రతినిధులు అధికారులు. ప్రకటించినప్పటికీ రాజకీయ ప్రాబల్యంతో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఆరోపణలు కూడా ఉన్నాయి. రెండో విడతలోనైనా అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఎంపిక చేయాలని ప్రతిపక్షాల నాయ కులు అర్హులైన బాధితులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు ఇప్పటికే సర్వేల నిర్వహించినప్పటికీ అర్హులైన వారి ఎంపిక జరుగుతుందా లేదా అనే సంశయం పేదల్లో ఉత్కంఠ నెలకొంది....

వెంకటాపురం ప్రధాన రహదారి పక్కన పట్టపగలే చెత్త డంపింగ్..!

- అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్..
- ప్రధాన రహదారే డంపింగ్ యార్డా..?
- పట్టపగలే చెత్త పోస్తున్న స్థానికులు.
- అందరూ వేస్తున్నారు.. మేమెందుకు వేయకూడదు?
- చెత్తపై బాధ్యత లేని సమాధానం.. అధికారులు ఎక్కడ..?
- ఇంటిని శుభ్రం చేసి.. ఊరిని చెత్తకుప్ప చేస్తే ఎలా?
- చెత్త కనిపిస్తే తొలగించాలి.. చెత్తకుప్పగా మారే వరకు చూడాలా?
- పంచాయతీ అధికారులపై ప్రజల ఆగ్రహం..
- వాహనంలో చెత్తను తెచ్చి పోస్తున్న పట్టించుకోని అధికారులు..

నూగూర్ వెంకటాపురం, సెప్టెంబర్ 10:(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)





ములుగు జిల్లా నూగూర్ వెంకటాపురం మండలంలోని ప్రధాన రహదారి పక్కన కొంతమంది షాపు యజమానులు పట్టపగలే పెద్ద ఎత్తున చెత్తను పడేస్తున్న దృశ్యాలు స్థానికంగా ఆందోళన కలిగిస్తున్నాయి. బులోరో వాహనంలో చెత్తను తీసుకొచ్చి రహదారి పక్కనే పారబోస్తున్న దృశ్యాలు కూడా కనిపిస్తున్నాయి. చెత్తలో కుళ్లిపోయిన కూరగాయలు, ఆహార వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. ప్రధాన రహదారి వెంట ప్రయాణించే ప్రజలు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిసే సమయంలో ఈ చెత్త మరింత కుళ్లిపోయి దోమలు, ఈగలు పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త ఎందుకు పడేస్తున్నారని ప్రశ్నిస్తే‘ ‘అందరూ వేస్తున్నారు.. మేమెందుకు వేయకూడదు?” అనే విధంగా సమాధానాలు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ఇబ్బంది కలిగించేలా ప్రధాన రహదారిని చెత్తకుప్పగా మార్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ అధికారులు, సంబంధిత పారిశుద్ధ్య సిబ్బంది వెంటనే స్పందించి చెత్తను తొలగించడంతో పాటు, రహదారి పక్కన చెత్త వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే చెత్త సేకరణకు సరైన వ్యవస్థ ఏర్పాటు చేసి, ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

జనసేన కార్యాలయంలో వేడుకలు.. భారీగా పాల్గొన్న మహిళలు

కొత్తగూడెం, అక్టోబర్ 10, (సూర్యోదయ వార్త)

విద్యానగర్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో డాక్టర్ జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ట్రస్ట్ చైర్మన్, మాజీ హెల్త్ డైరెక్టర్, జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గడల శ్రీనివాస రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు కొత్తగూడెం నియోజకవర్గం నుండి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.





తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా ఈ వేదికలో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని పలువురు పేర్కొన్నారు. కార్యాలయ ప్రాంగణం బతుకమ్మ పాటలు, మహిళల సందడితో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి వచ్చిన మహిళలకు ట్రస్ట్ సభ్యులు ఎంగిలిపూల బతుకమ్మ శు భాకాంక్షలు తెలిపారు.

నల్గొండ జిల్లాలో భారీ చోరీల ముఠా గుట్టురట్టు





దేవరకొండ : నల్గొండ జిల్లాలో వరుస పగటిపూట దొంగతనాలకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న నలుగురు సభ్యుల అంతర్ జిల్లా దొంగల ముఠాను మర్రిగూడ, చింతపల్లి పోలీసులు శనివారం సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ. 21.05 లక్షల విలువైన 11 తులాల బంగారం, 1.5 కిలోల వెండి, రెండు మోటార్ సైకిళ్లు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు వెల్లడించారు.

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నాంపల్లి సర్కిల్ పరిధిలో శనివారం ఉదయం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించడంతో ఈ భారీ ముఠా ఉదంతం వెలుగుచూసింది. పోలీసుల విచారణలో నిందితులు వనపర్తికి చెందిన బొల్లేమోని అంజి అలియాస్ స్వామి (29), హైదరాబాద్‌కు చెందిన పూజారోల్లా శివకుమార్ అలియాస్ శివయప్ప (23), కొత్తకోటకు చెందిన సంపంగి రాజు అలియాస్ రాము (30), మహబూబ్‌నగర్‌కు చెందిన గోపి అరుణ్ కుమార్ (23)గా గుర్తించారు. ప్రధాన నిందితుడు అంజి గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లాడు. అక్కడ మిగిలిన ముగ్గురితో పరిచయం పెంచుకుని, జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత అందరూ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. విలాసవంతమైన జీవితం గడపడం, అప్పులు తీర్చుకోవడం కోసమే వీరు దొంగతనాల బాట పట్టినట్లు విచారణలో తేలింది.

ఈ ముఠా నల్గొండ జిల్లాలోని మర్రిగూడ, చింతపల్లి, గుర్రంపోడు, దేవరకొండ, కనగల్, నకిరేకల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పగటిపూట 9 చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ ఇళ్లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ సూచించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన మర్రిగూడ, చింతపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్లు బి. రాంబాబు, ఎం. రామ్మూర్తి, పోలీసు సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాసరావు రివార్డులతో ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుత్ షాక్‌తో వలస కూలికి గాయాలు

మెరుగైన వైద్యం కోసం ఏటూరు నాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు..

కన్నాయిగూడెం. ములుగు జిల్లా. అక్టోబర్ 10(సూర్యోదయ వార్త . ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం భూపతిపురం గ్రామంలో శనివారం విద్యుత్ షాక్ తో గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా . జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ప రవింద్ విద్యుత్ స్తంభం పై వైర్లు సరి చేస్తుండగా షాక్ కోటి కింద పడినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటీ మహేశ్వరి. పైలట్ రవీందర్. ఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏటూరు నాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు . ఈ ఘటన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

‘ఇరుముడి’ తర్వాత రవితేజ సినిమా ఇదే!



మాస్ మహారాజా రవితేజ అభిమానులకు మరో ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చేసింది. తన తదుపరి సినిమాపై వస్తున్న వార్తలకు చిత్రబృందం అధికారిక ప్రకటనతో తెరదించింది. యువ దర్శకుడు వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో రవితేజ తన 78వ సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన వివరాలను నిర్మాణ సంస్థ బ్రిడ్స్ ప్రొడక్షన్స్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది.

రవితేజ -- వివేక్ ఆత్రేయ కాంబోలో

రవితేజ కెరీర్‌లో 78వ చిత్రంగా తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌కు (#78) వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించనున్నారు. లక్ష్మణ్, శ్రీనిరావు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. కొంతకాలంగా ఈ కాంబినేషన్‌పై ప్రచారం జరుగుతుం డగా.. తాజాగా నిర్మాణ సంస్థ అధికారిక ప్రకటనతో ఈ వార్తలకు బలం చేకూరింది. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్‌ను అక్టోబరు 11న ప్రకటించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

కథానాయిక ఎవరు?

ఈ చిత్రంలో రవితేజ సరసన నటించబోయే కథానాయిక ఎవరు? ఇతర కీలక పాత్రల్లో ఎవరెవరు కనిపించనున్నారు? అనే విషయాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. టైటిల్ ప్రకటనతో పాటు సినిమా గురించి మరిన్ని వివరాలు వెల్లడవుతాయా? అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. దర్శకుడు వివేక్ ఆత్రేయ తనదైన కథాకథనంతో ఈ చిత్రాన్ని ఎలా తెరకెక్కించనున్నారో చూడాలి

రామ్ చరణ్ కీలక నిర్ణయం.. బాలీవుడ్ దర్శకుడికి నో చెప్పారా?



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ‘ఆర్ఆర్ఆర్’తో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఆయన, తన తదుపరి సినిమాల విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. కథల ఎంపిక నుంచి దర్శకుల వరకు ప్రతి విషయంలోనూ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే ఓ బాలీవుడ్ దర్శకుడు చెప్పిన కథకు రామ్ చరణ్ నో చెప్పారంటూ తాజాగా సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వార్తలపై పూర్తి క్లారిటీ రావలసి ఉంది. రామ్ చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌కు టాలీవుడ్‌లో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వీరిద్దరి కలయికలో వచ్చిన ‘రంగస్థలం’ బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించడంతో పాటు చరణ్ నటనకు ప్రశంసలు తెచ్చిపెట్టింది. ఇప్పుడు ఈ విజయవంతమైన జోడీ మరోసారి కలిసి పనిచేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాత్కాలికంగా ‘ఆర్‌సీ17’గా ప్రచారంలో ఉన్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మించనున్నట్లు సమాచారం. దసరా సందర్భంగా సినిమా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజాగా బాలీవుడ్ దర్శకుడు అపూర్వ లఖియా, రామ్ చరణ్‌ను కలిసి ఓ కథ వినిపించారనే ప్రచారం తెరపైకి వచ్చింది. అయితే ఆ కథపై చరణ్ ఆసక్తి చూపలేదని, ప్రాజెక్టుకు అంగీకారం తెలపలేదని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం తన కెరీర్‌లో కీలకమైన దశలో ఉన్న రామ్ చరణ్, బలమైన కథలు ఉన్న సినిమాలకే ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఆయన నిజంగానే ఈ దర్శకుడి ప్రతిపాదనను తిరస్కరించారా? అందుకు కారణం ఏమిటి? అనే విషయాలపై ఇప్పటివరకు అధికారిక సమాచారం లేదు. రామ్ చరణ్, అపూర్వ లఖియా గతంలో ‘జంజీర్’ సినిమాతో కలిసి పనిచేశారు. అమితాబ్ బచ్చన్ నటించిన అదే పేరుతో వచ్చిన హిందీ చిత్రానికి రీమేక్‌గా ఈ సినిమా రూపొందింది. తెలుగులో ‘తుఫాన్’ పేరుతో విడుదలైంది. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా కథానాయికగా నటించగా, సంజయ్ దత్, ప్రకాశ్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. ఈ సినిమా ఫలితం ఆయన కెరీర్‌లో ఓ చేదు అనుభవంగా మిగిలిపోయింది.



రిలీజ్ ముందే బంపరాఫర్.. యష్‌తో డేవిడ్ రెడ్డి దర్శకుడు కొత్త సినిమా?

ఫిలిం నగర్‌లో ప్రస్తుతం ఓ సరికొత్త చర్చ జోరుగా సాగుతోంది. మంచు మనోజ్ హీరోగా బ్రిటిష్ కాలం నాటి బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న పాన్-ఇండియా పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘డేవిడ్ రెడ్డి’. ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న యువ దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి పేరు ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. అతడి తొలి సినిమా ఇంకా ప్రేక్షకుల ముందుకు రాకముందే, ఆయన పేరు కన్నడ రాకింగ్ స్టార్, పాన్-ఇండియా స్టార్ యష్‌తో ముడిపడి వినిపిస్తుండటం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. హనుమ రెడ్డి కథకు యష్ టీమ్ ఫిదా అయినట్లు తెలుస్తుంది. ‘కేజీఎఫ్’ ‘టాక్సిక్’ వంటి భారీ చిత్రాల తర్వాత యష్ చేయబోయే నెక్స్ట్ ప్రాజెక్ట్‌ల జాబితాలో హనుమ రెడ్డి సినిమా కూడా చేరిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కేవలం కొత్త దర్శకుడే అయినప్పటికీ, హనుమ రెడ్డి మొదటి సినిమాకే రవి బస్రూర్, ఆచార్య వేణు, సుప్రీమ్ సుందర్ వంటి టాలెంటెడ్ అగ్ర టెక్నీషియన్లను రంగంలోకి దించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ టెక్నికల్ వాల్యూస్, సినిమా టీజర్ క్రియేట్ చేసిన ఇంపాక్ట్ చూసే యష్ స్వయంగా ఈ దర్శకుడితో చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ విపరీతమైన బజ్ కేవలం సినిమాపై ఉన్న హైప్ కారణంగా పుట్టుకొచ్చిన గాసిప్ మాత్రమేనని కొందరు సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, దర్శకుడి విజన్ చూస్తుంటే కచ్చితంగా ఇది నిజమయ్యే అవకాశాలున్నాయని మరికొందరు బలంగా నమ్ముతున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్‌పై అటు యష్ క్యాంప్ నుంచి కానీ, ఇటు హనుమ రెడ్డి వైపు నుంచి కానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఏది ఏమైనా, మంచు మనోజ్ లాంటి హీరోతో ‘డేవిడ్ రెడ్డి’ ద్వారా ఇండస్ట్రీని షేక్ చేయడానికి సిద్ధమవుతున్న హనుమ రెడ్డికి, రాబోయే రోజుల్లో ఏకంగా రాష్ట్రాలు దాటి పాన్-ఇండియా రేంజ్‌లో బిగ్ ఆఫర్స్ వస్తుండటం మాత్రం తెలుగు సినిమా రంగంలో సంచలనంగా మారింది. అసలు ఈ రూమర్ వెనుక నిజమెంత ఉందనేది తెలియాలంటే కొద్దిరోజులు వేచి చూడాల్సిందే.

తాను కూడా తెలుగమ్మాయినే

ది రాజాసాబ్ బ్యూటీ నిధి అగర్వాల్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తెలుగు పలు సినిమాల్లో హీరోయిన్‌గా చేసింది. ఈ ముద్దుగుమ్మ గతేడాది రిలీజైన ప్రభాస్ ది రాజాసాబ్ చిత్రంలో హీరోయిన్‌గా మెప్పించింది. ప్రస్తుతం సినిమాలు లేకపోయినా.. తాజాగా ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి హాజరైంది. ఈ సందర్భంగా తనకు ఓ ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. తెలుగబ్బాయిని పెళ్లి చేసుకుంటారా? అని ఓ రిపోర్టర్ అడగడంతో దీనిపై స్పందించింది. అది తెలియదు.. మే బీ చేసుకోవచ్చంటూ సరదాగా నవ్వుతూ సమాధానమిచ్చింది. అంతేకాకుండా తనకు తెలుగు రాష్ట్రాలతో ఉన్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తాను హైదరాబాద్‌లోనే పుట్టానని తెలిపారు. తాను కూడా తెలుగమ్మాయినేనని నిధి అగర్వాల్ స్పష్టం చేశారు. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



శర్వానంద్ భోగి.. క్రేజీ సాంగ్ రిలీజ్

టాలీవుడ్ హీరో శర్వానంద్ బైకర్ తర్వాత నటిస్తోన్న తాజా చిత్రం భోగి. ఈ మూవీకి సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే టీజర్ రిలీజ్ చేయగా ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ మూవీ నుంచి క్రేజీ సాంగ్ రిలీజ్ చేశారు. ఎగిరి వరంగలేసి అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఈ పాటకు చంద్రబోస్ లిరిక్స్ అందించగా..నల్గొండ గద్దర్ నర్సన్న, కందుకూరి శంకర్‌బాబు, రేలారే గోపాల్ ఆలపించారు. ఈ సాంగ్ భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేశారు. కాగా.. ఈ చిత్రాన్ని 1960ల నాటి తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు నేపథ్య కథతో రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీకి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. పీరియాడిక్ డ్రామాగా వస్తోన్న ఈ సినిమా నవంబర్ 12న థియేటర్లలో విడుదల కానుంది.

